# ఇలా ఆలోచించండి

-కె.కె.రఘునందన

"మీనా ఏడుస్తూందండీ..." అంది మమత భర్త శ్రీనాథ్‌తో.

"ఎప్పుడూ అదే పనిగా..." అన్నాడు.

"వీధిలో ఎవరో ఏదో అన్నారని..." మరలా అక్కడే తచ్చాడుతూ అన్నదామె.

"ఎవరో ఏదో ఒకటి అంటూనే ఉంటారు. దానికి ప్రతీసారి బావురుమంటే ఎలాగా?" అప్రసన్నంగా అన్నాడు శ్రీనాథ్.

"మీరోసారి వచ్చి..." తగ్గు స్వరంతో అన్నది మమత.

"...ఓదార్చాలంటావు. కానీ ఇలా ఎన్నిసార్లు నేనోదారుస్తూ కూర్చోగలను" శ్రీనాథ్‌లో ఎక్కడ్లేని విసుగు తారాస్థాయికి వెళ్లింది.

మరింక ఆస్థానంలో నిలవలేకపోయింది మమత. లోనికి వెళ్లి తనవంతుగా తల్లి ప్రేమను పంచింది. అనునయంగా హత్తుకుంది.

"అమ్మా! ఇక్కడ నేనున్నంతకాలం మీకు గుదిబండనేనమ్మా! అవతల ఎవరో ఒకరు నన్ను ఏదో ఒకటి కుళ్ళబొడుస్తూనే ఉన్నారు. పెళ్లయిన ఆడదానికి మెట్టినిల్లేకానీ, పుట్టిల్లు స్థావరం కాకూడదమ్మా" అని వలవలా ఏడ్చేసింది.

శ్రీనాథ్‌కిదంతా చెవిన బడుతూనే ఉంది. ఆ నరకాయాతనేమిటో అతనికి అవగాహనే.

* * *

మీనా తనింటికి వచ్చేసి చాలాకాలం అయింది.

నిజానికి లోకం ఒత్తిడికి తలొగ్గి మీనాకు పెళ్లిచేశాడే కానీ ఇంకా చదివిద్దామనే అనుకున్నాడు. ఆమె ఆశలు మొగ్గలో త్రుంచేసి తను పెళ్లి సంకెళ్ళు వేసినట్లయ్యింది.

వచ్చిన సంబంధాలలో మీనాను ఇట్టే ఆకర్షించి నచ్చుకున్నాడని తనూ సరేనన్నాడు. పెట్టుపోతలన్నీ సవ్యంగానే సాగాయి. అపశ్రుతి ఎలా మొదలైందో తెలీదుగానీ ప్రతీ పనికి ఎద్దేవా! అత్తగారిదే రాజ్యం. ఆడపడుచులదే హవా. భర్త రాజీవ్ డూడూ బసవన్నే. అమ్మకొంగు చాటు బిడ్డడిలా ఆమె చెప్పింది చేస్తూ, విషం చిందించినా అమృతం అంటూ నాక్కొనే ఏభ్రాసి.

అటువంటి గడపలో కాలు పెట్టడం మీనాకు కోరితెచ్చుకున్న దురదృష్టంలా అయింది.

మీనాకు కడుపుపండింది. అంత చక్కని తీయని వార్త వారందరికీ చేదుమాత్ర మింగినట్లైంది. కనీసం భర్తగా రాజీవయినా సంతోషించాడా అంటే అదీ లేదు.

పక్కలో దూరింది కాక అప్పుడే పిల్లలు కలగడం ఘోరనేరంలా మీనాను దెప్పిపొడవడం మొదలెట్టాడు.

"అదేంటండీ దైవమిచ్చిన బిడ్డల్ని కాలదన్నుకుంటావా. మీ వాళ్లలా మీరూ మాట్లాడతారేంటి?" అని మీనా అడిగేసింది.

తాడెత్తున లేచాడు రాజీవ్. వారికిష్టం లేదు కాబట్టీ తనకూ ఇష్టంలేదన్నాడు. అంతే అది మొదలు మీనాకు కష్టాలు మొదలైనాయి,

కడుపు పండినందుకు ఓ బిడ్డడు దోగాడతాడన్న సంబరం ఏ కొంచెమైనా లేదు సరికదా! కనీసం నెలలు నిండుతున్నా సరే ఆ ఇంట్లో చాకిరికీ అంతుపొంతు లేదు. పనిమనిషిని కూడా మానిపించేశారు. ఆడపడుచులు వేలువేసి ముట్టుకునే వారు కాదు. ఉసూరుమంటూనే బండెడు చాకిరీ చేసుకునేది మీనా.

ఆ ఇంట్లో వారి సంగతి సరే. కనీసం భార్య కోసం ముచ్చటగానయినా మూరెడు మల్లెపూల దండ తీసుకురావాలనిగాని, ఓ స్వీటు తెచ్చి తిని పించాలని గానీ రాజీవ్‌లో మృగ్యమవ్వడం ఘోరమే! నెలలు నిండుతున్నాయి. అత్తవారిని అడిగి మీనాను పురిటికి తీసుకువద్దామని ముహూర్తం కూడా పెట్టించుకునే వెళ్లాడు శ్రీనాథ్.

అయినా గుండెలుగ్గబెట్టుకుని తనే గొంతు విప్పాడు శ్రీనాథ్.

"అమ్మాయి నీళ్లు పోసుకుందని మీకు తెలుసు. ఏడవనెల. కొంత విశ్రాంతిగా ఉంటే బాగుంటుందని పురుటికి తీసుకెళ్లాలని వచ్చాను" నెమ్మదిగా ప్రారంభించాడు.

"అంటే మీ అమ్మాయికి మా దగ్గర విశ్రాంతి లేదనేగా.." కటువుగా అన్నది వియ్యపురాలు నందితమ్మ.

"అహ...అలా అని కాదు. సాంప్రదాయం ప్రకారం మేం మొదటి సారి పురుడు పోయాలని పుట్టింటికి తీసుకెళ్లాలని. అంచేత మీరు.." సావధానంగా అనడానికి ప్రయత్నించాడు శ్రీనాథ్.

"మీ సంప్రదాయం ఏడిసినట్లే ఉంది గానీ ఇంతకీ అంత కొంపమునిగిపోయినట్లుగా పిల్లల్ని ఎందుకు కనాలసలు? మేం ఆగమంటే ఆగారాని. ఈసారి అబార్షన్ చేయించుకోమంటే విన్నాదా?" ఛర్రుమంది.

"అమ్మమ్మ! అలాంటి అపభ్రంశపు మాటలు ఇప్పుడొద్దు. అమ్మాయి ఆరోగ్యరీత్యా వద్దన్నాం. అయినా తప్పుఒప్పుల విచారణ ఈ సమయంలో తగదు. మా పిల్లను తీసుకెళ్లాలనే వచ్చాను మీరు అనుమతిస్తే.." అభ్యర్థనగా అడిగాడు శ్రీనాథ్.

"మా ఇష్టంతో మీకు పనేంటిలెండి? తీసుకెళ్ళి చావండి" విసురుగా అనేసి లోనికి వెళ్లిపోయింది నందితమ్మ.

మధ్యలో ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారు. అవన్నీ శూలాల్లా గుచ్చి వేధించసాగాయి. కానీ సహనంతో అణచుకున్నాడు.

అల్లుడు రాజీవ్ గదిలోంచి వచ్చాడు. అతడితో చెబుదామని ముందుకువెళ్లాడు శ్రీనాథ్.

"అల్లుడూ! అమ్మాయిని తీసుకెళ్లడానికి వచ్చా...నువ్వు"

"హుఁ! తీసుకెళ్లండి నాతో ఎందుకూ చెప్పడం దండగ" మొహం చిట్లించుకుని లోనికెళ్లిపోయాడు రాజీవ్.

అక్కడ ఎవరూ కూడా తమ ఉనికికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అంతమందిలో ఏ ఒక్కరైనా సబబుగా మాట్లాడతారని ఎదురుచూసినా నిరాశే

ఎదురైంది. వియ్యంకుడు కూడా ఇసుకమూటలా కూచున్నాడు తప్ప మాటా మంతీలేవు. భర్తతో చెబుదామని ప్రయత్నించింది మీనా. అతను తలుపులు బిడాయించుకున్నాడు. అత్తగారు వంటపనిలో మునిగిపోయింది. దగ్గరగా వెళ్లి కాళ్లకు దణ్ణం పెడదామని వంగితే పాదాలు వెనక్కి లాగేస్కుంది.

ఆడపడుచులు సరేసరి క్రోధాగ్ని జ్వాలలు కురిపిస్తున్నారు. ఇంక చేసేది లేక బట్టలు సర్దుకుని తండ్రి శ్రీనాథ్‌తో బయలుదేరింది మీనా.

★ ★ ★

సీమంతం జరిపినప్పుడు స్వయంగా భార్యతో సహా వెళ్లి పిలిచాడు. కానీ ఒక్కరూ తొంగిచూడలేదు. మీనాకు నొప్పులొచ్చిన మరుక్షణమే ఆసుపత్రిలో జాయిన్ చేసి వాళ్లకి ఫోన్ చేశాడు. మీనా మగబిడ్డని ప్రసవించింది. అదీ తెలియజేశాడు. కానీ అట్నుంచి అనుభూతి నిండిన స్వరం ఏదీ వినిపించలేదు.

ఆడపిల్లను కన్న తల్లిదండ్రులుగా తమకు తప్పదు కాబట్టీ ఇంకా బ్రతిమాలుడు ధోరణిలో ఒదిగి బ్రతుకుతున్నారు. పిల్ల జీవితం సరిదిద్దగలగాలి. భార్యభర్తలలో ఏ పొరపొచ్చాలు లేకుండా సర్వకాలాల్లోనూ జీవించాలి. అదే తమ ఆశయం. సదుద్దేశ్యం. కానీ వాటిని కాలరాయాలని ప్రయత్నిస్తున్నారు.

ఈ విషయం రూఢీ కావడానికి ఎంతో కాలం పట్టలేదు. బాలసారె కార్యక్రమం నాటికైనా మనుషులు ఓ తీరుకు వస్తారని ఎదురుచూశాడు శ్రీనాథ్.

కానీ అదే మొండిధోరణి. పెళ్లి కావలసిన ఇద్దరు ఆడపిల్లలను ఇంట్లో పెట్టుకుని వారంత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం విచిత్రంగా, జుగుప్సాకరంగా తోచింది.

బంధుజనాలను పిలిచి పెద్ద ఎత్తున బాలసారె జరిపిస్తే ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందోనని దగ్గర్లో ఉన్న అన్నవరంలో కార్యక్రమం జరిపించాలని బయలుదేరారు.

అప్పుడు కూడా విషయం వారికి తెలియజేయకపోలేదు శ్రీనాథ్. కానీ స్పందన శూన్యం. అతి చిన్న విషయాలలో వచ్చిన మనస్పర్థలు ఇంత విస్తృతంగా అగ్నిజ్వాలలై, మృదు హృదయాలను మండిస్తాయని ఏనాడూ ఊహించలేదు శ్రీనాథ్. తదాదిగా మీనా పుట్టింట్లోనే ఉంది. పిల్లాడు వివేక్‌ను చీటికీమాటికీ పలకరించే అస్వస్థత పెనుభారమైంది శ్రీనాథ్‌కు. దాంతో శ్రీనాథ్‌లో ఎక్కడ్లేని చికాకు బయలుదేరింది.

★ ★ ★




తనకెందుకింత తొందరగా పెళ్లి చేసారంటూ మీనా, సరియైన సంబంధం తీసుకురాలేదని, తొందరపడ్డారంటూ నిలదీసే మమత... అనారోగ్యంతో దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చే వివేక్..

ఈగోలంతా భరించలేక వీధిలోకి వెళ్ళిపోయేవాడు శ్రీనాథ్. కానీ అక్కడ కూడా అప్రశాంతతే! పీక్కుతినే మనుషులకు కరువు లేదు.

"మీ అమ్మాయినింకా పంపలేదూ! పురుడు పోసి ఆర్నెల్లయింది కామోసు..." అని ఒకరు,

"మీ అల్లుడు తరఫువాళ్ళెవరూ మీ గడప తొక్కడం లేదేమిటి? అమ్మాయే మైనా తొందరపడి తగువాడిందా?" అని మరొకరు.

ఇలా రకరకాల ప్రశ్నల వర్షం, విమర్శల బాణాలు. ఇద్దరిముగ్గురికి చాలా కటువుగానే జవాబిచ్చాడు శ్రీనాథ్. అయినా లోకం నోరు మూయడం ఎవరితరం? ఎవరికివారు ఎద్దేవా చేస్తూనే ఉన్నారు.



ఆ ప్రభావం శ్రీనాథ్ మీద అమితంగా పడ్డది. నదుల గమ్యం సాగరగర్భమే. అలాగే వివాహిత స్త్రీ ఎప్పటికైనా కలిసి ఉండాల్సింది భర్తతోనే. ఏడడుగులు నడిచిన స్త్రీ ఏడు జన్మలైనా విడివడకుండా ఉంటేనే ఆజన్మకు సార్థకం.

ఇలా శ్రీనాథ్‌లో భావాలు అంచెలంచెలుగా మారాయి. తండ్రిగా తనెంత చేసినప్పటికీ శంఖంలో పోస్తేనేగానీ తీర్థం కానట్లుగా భర్త ప్రాధాన్యత వేరు.

ఆలోచనలకు తెరపడినట్లుగా ఎదుటి వ్యక్తి దగ్గుతో ఈలోకంలోకి వచ్చాడు శ్రీనాథ్.

"చూడు శ్రీధర్! మీ ఇంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకుంటున్నానని అన్యథా భావించవద్దు. మీ అమ్మాయి స్థితి బాధాకరం. పిల్లనిచ్చిన తండ్రిగా నీకు తెలీ దని కదా. వాళ్ళు మహా మూర్ఖులే అనుకో అయినా సరే అమ్మాయి ఉండా ల్సింది ఇక్కడ కాదు భర్త దగ్గర. లోకం నోరుమూయలేనప్పటికీ సవ్యమైన రీతిలో నడిస్తే తప్పకుండా మూతపడుతుంది. మరి మీ అమ్మాయిని అత్తారిం టికి దిగబెట్టడమే అన్నివిధాలా మంచిది" సబువుగా హితబోధ చేసిన వ్యక్తి బాలసుందరం. ఎదురు మాట్లాడలేకపోయాడు శ్రీనాథ్.

"భార్యభర్తలన్నాక గొడవలు సహజం. ఉమ్మడి కుటుంబంలో సర్దుబాటు తత్వం తప్పదు. ఆడపిల్లది ఎటువంటి తప్పులేకపోయినా లోకం దృష్టిలో ఆమె అత్తవారింట్లో మనలేకపోయింది అనే అంటుంది. అందువల్ల ఎలాగోలా సయోధ్య చేసుకుని మీ అమ్మాయిని అత్తవారింటికి పంపెయ్యి. తరువాత తరు వాత వాళ్లే సర్దుకుపోతారు. ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే. నిర్ణయం నీ ఇష్టం" అని లేచి వెళ్లిపోయాడు మిత్రుడు బాలసుందరం.

ఆ మాటలు విన్నాక శ్రీనాథ్ నలిబిలిపడ్డాడు.

ఒక ఆడపిల్ల తండ్రిగా తనేమైనా పొరపాటుగా ప్రవర్తించాడా? అమ్మాయిని అత్తవారింటికి దిగబెట్టాల్సిన అవసరం, బాధ్యత తనవేనేమో.

నిజానికి తనుగాని భూతద్దంలోంచి చూసి ఆలోచించాడా? అక్కడి విష యాలన్నీ ఇరుగుపొరుగులతో చెప్పబట్ట వీరందరికీ తెలిసిందేమో. తనకు అన్యాయం జరిగిందంటూ మీనా, కూతురి దీనగాథని మమత ప్రచారం చేసిన ట్లయిందేమో. ఒక్కసారి ఆలోచనలు చుట్టుముట్టాయి.

ఔను! మీనా ఇలా ఎంతకాలం భర్తతోడు లేకుండా పుట్టింట్లో ఉండిపో తుంది? అత్తారింటికి పంపితే ఏనాటికైనా తన బిడ్డమీద అనురాగం, ప్రేమ పెరిగి భార్యగా మీనాకు దగ్గరవుతాడేమో.

అలాకాకుండా మొండిగా తనవద్దనే కూతుర్ని అట్టే పెట్టుకుంటే ఫలితం. లోకం దృష్టిలో చిన్నచూపు. తమనో మూర్ఖుల్లా ముద్ర..రాను రాను పరిస్థి తుల్లో అనేక రకాలుగా మార్పులు. ఇలా పరిపరివిధాల ఆలోచనల్లో కొట్టుకు పోతున్న శ్రీనాథ్ రోడ్డుమీద ఏమరుపాటుగా ఉన్నంతలో ఒక్కసారిగా ఏదో మీదకు వచ్చినట్లయి కళ్ళు బయర్లుకమ్మాయి. అంతే స్పృహ కోల్పోయాడు.

* * *

శ్రీనాథ్ కళ్లు తెరిచేసరికి తను ఓ కొత్త ప్రదేశంలో ఉన్నట్లు గుర్తించాడు.

ఎదురుగా ఓ అమ్మాయి నిలుచుని ఉంది.

"అమ్మా! ఈ ఇంట్లో నేను..." అయోమయంగా అన్నాడు శ్రీనాథ్.

"మీకంతా అర్థం అవుతుంది....మీరీ మాత్ర వేసుకోండి" అని చేతిలో పెట్టింది. గ్లాసుతో నీళ్ళు అందించింది.

ఆ అమ్మాయి వెళ్లిపోయాక ఒకాయన శ్రీనాథ్‌కి ఎదురుగా వచ్చి నిల్చు న్నాడు. అతను నవ్వుతూంటే ఎవరో ఏమిటో అర్థంకాలేదు.

"నన్ను పోల్చుకోడానికి నువ్వు నానా తంటాలు పడ్తున్నావుకదూ! నేను కూడా నిన్ను గుర్తుపట్టనట్లయితే నువ్వా ప్రమాదం నుంచి బయటపడేవాడివి కాదు. మరేం కంగారుపడకు. నీకో యాక్సిడెంట్...నేను గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసి నువ్వు కోలుకున్నాక మా ఇంటికి తీసుకొచ్చేశాను. ఇప్పటికైనా నన్ను..." అన్నాడాయన దగ్గరగా కూర్చుంటూ.

శ్రీనాథ్ తికమక పడుతుండగా "రాజమండ్రిలో బిఇడి చేసినప్పుడు గోదా రొడ్డు కెల్లి రోజూ కవితలు రాయడం... చర్చించుకోవడం..." అనంటుండ గానే-

"నువ్వు....నువ్వు సోమనాథానివి కదూ. చిత్రం! ఇంతకాలానికి ఈవిధంగా కలవడం అద్భుతంగా అనిపిస్తోంది" తెగ పరవశించిపోతూ అన్నాడు శ్రీనాథ్ అతని చేతుల్ని ఆప్యాయంగా స్పృశిస్తూ.

"ఈతాతెవరు..." ముద్దుముద్దుగా అడిగింది పాప.

చెప్పాడు సోమనాథం. ఆ ఇరువురి అనుబంధం చూస్తే ముచ్చటేసింది శ్రీనాథ్‌కి. ఒక్కసారిగా చలించిపోయాడు. తన మనవడు వివేక్ గుర్తుకొచ్చాడు. ఒక్కోసారి వాడు తన కాళ్ల దగ్గరకొచ్చి ఆగేవాడు కానీ తాను ఏదో చికాకుల్లో ఉండి పట్టించుకునేవాడు కాదు. అది చూసి వాడు బేలముఖం వేసేవాడు.

ఆ దృశ్యం గుర్తుకొచ్చి మనసు బాధగా మూలిగింది. కళ్లు నీటితో వర్షిం చాయి. అది చూసి సోమనాథం భుజం తట్టి విషయం అడిగాడు.

## అద్భో... ఎంత ఎండ!

మన దేశంలోలాగే రష్యాలో కూడా ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకీ పెరిగిపోతున్న ఈ ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఎవ రికి తోచిన మార్గాలు వారు అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా ముగ్గురు యువతులు పిల్లలతో కలసి గడ్డ కట్టి కరుగుతున్న ఓ నదిలో దిగి స్నానమా డుతున్న దృశ్యమిది!



## మెటల్స్ మెమొరీ

సొట్టలు పడిన మెటల్ వస్తువుల్ని, వంగిపోయిన క్లిప్పుల్ని మళ్లీ పూర్వ రూపానికి తేవడం అసంభవమని ఇంతకాలంగా అనుకునేవాళ్లం. కానీ దాని పూర్వ సంధానంలోని అణు బంధనం ఎంత పకడ్బందీగా ఉంటుందంటే ఆ వస్తువుల్ని కొంచెం వేడి చేస్తే అవి ఒరిజినల్ రూపానికి చేరుకుంటాయని, ఏ మెటల్ అయినా అంతేనని ఓ రీసెర్చిలో వెల్లడైంది. ఆ పరిశోధనవల్ల దెబ్బతిన్న కార్లని, విమానాలని, మెషిన్లని ఇకనుంచి సులభంగా రిపేరు చేయగలుగుతామని నిపుణులు అంటున్నారు.

-తటవర్తి

చెప్పి బావురుమన్నాడు శ్రీనాథ్. అంతా విని నవ్వాడు సోమనాథం.

"నీక్కూడా నా పరిస్థితులు నవ్వులాటగా ఉన్నాయా?'' సూటిగా ప్రశ్నించాడు శ్రీనాథ్.

"కాదు నీ ఆలోచనా విధానానికి నవ్వుకున్నాను'' తేలిగ్గా అనేశాడు సోమనాథం.

"నా స్థానంలో నువ్వుంటే నా బాధేమిటో నీకు తెలిసొచ్చేది'' నిష్ఠూరంగా అన్నాడు శ్రీనాథ్.

"ఆ బాధేమిటో నాకు తెలుసు. ఎందుకంటే నీలాగే నాకూ ఒక కూతురు రమ్య. వచ్చిన సంబంధాల్లో మంచి సంబంధం అని అమ్మాయిని ఇష్టపడ్డాడనే చేశాను. కానీ భర్తకు ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ. రాకపోకలు కూడా ఎక్కువే. వాళ్లని ఆదరిస్తే రాసుకుపూసుకు తిరిగావని, ముక్తసరిగా ఉంటే గుమ్మంలోంచే తరిమేశావంటూ నానా జట్టీ ఆడేవాడు. పైగా అత్తవారికి అనుమానాలు, ఆగాలి భర్తకి సోకింది. పొరపొచ్చాలు ప్రారంభం. వాదోపవాదాలతో చిరాకెత్తిపోయేది. తన శీలాన్ని అనుమానిస్తూ క్షణక్షణం నరకం సృష్టిస్తే ఏ ఆడదానికి ఉండాలనిపిస్తుంది? ఆలుమగల మధ్య చిచ్చు తారాస్థాయికి వెళ్లింది. ఈ విషయం నలుగురి నోళ్లలో నానింది. ఓ ఆడపిల్ల తండ్రిగా తలెత్తుకోలేకపోయాను. వారి నిరంకుశ ధోరణికి విసిగిపోయాను. అమ్మాయి ఓ బిడ్డకు తల్లి అవుతున్నందుకు నాకే తప్ప వారెవరికీ అనుభూతిలేదు.

వారి తృణీకార భావంతో విసుగెత్తిపోయిన నేను నిష్కర్షగా అమ్మాయిని నావెంట తీసుకువచ్చేశాను. బిడ్డకి జన్మనిచ్చిన విషయం తెలియపరిచినా వారి నుండి ఎటువంటి జవాబు లేదు. లోకం నానారకాలుగా వాఖ్యానాలు చేసింది.

అయినా చలించలేదు. మరలా ఆ నరకంలోకి తోయాలని నేనేనాడూ ప్రయత్నించలేదు. నేను చేసిన ప్రయత్నమల్లా మా అమ్మాయి సునందను తన కాళ్లమీద తను నిలబడేలా చేయాలని. బిఇడికి ప్రిపేరయి సాధించింది. ఒక వైపు కాన్వెంట్‌లో పనిచేసుకుంటూనే డియస్సీకి చదువుతూంది.

భార్యకి భర్త ఎంత అవసరమో, భర్తకి భార్య అంత అవసరమే. అల్లుడికి ఆ అవసరం కలిగిననాడు భార్యను వెతుక్కుంటూ రాక మానడు. అదే భావం మాలో జీర్ణించుకుపోయింది. భర్తలేక పోవడం వల్ల బ్రతుకుభారం అయిపోయిందనీ, ఎప్పటికైనా కాళ్ల బేరానికి రాకపోరా అని వాళ్లు నిరీక్షించేలా మనం ప్రవర్తించకూడదు. మనం హుందాగా బ్రతకాలి. నిజానికి నాకొక్కటే ఆనందంగా ఉంది. పసికందునుంచి ఊహ తెలిసేదాకా నా మనవరాలితో వాళ్ళెవరూ పొందలేని సంతృప్తి, సంతోషం నా పరమైనాయి. బోసినోటితో నవ్వడాలు, దోబూచులాటలు, అల్లరి మారాంలు, చంకనెక్కడాలు..బుడి బుడి నడకల. గుండెల మీద బోర్లా పడుకుని చేసే సందళ్ళు, లాలిస్తూ జోకొట్టడాలు, ముద్దుముద్దుమాటలు..ఈ బాల్య ప్రపంచం అంతా నాదయ్యింది. ఈ రస రమ్య జగతిని ఓ తండ్రిగా నా అల్లుడు గానీ, ఆ కుటుంబంలో ఎవరైనా గానీ పొందలేకపోయారు.

కూతురు నా దగ్గరుండి పోయిందన్న అశాంతి నాలో ఇసుమంతైనా లేక పోగా నా మనవరాలు నాకిచ్చిన మానసిక ప్రశాంతత, ఆనందం నాలో దిగులుకు చోటులేకుండా చేశాయి. నాకు నా కూతురు, మనవరాలు భారమని ఏనాడూ అనుకోలేదు. సునంద వైవాహిక జీవితంలో పలికిన అపశృతిని సరిదిద్దడానికై నేను చేసిన మొదటి పని ఆమెలో ఆత్మస్థైర్యం కల్పించడం.

ఎవరికైనా ఆటుపోటులు సహజం. వాటిని తట్టుకోడానికై మనం ఆలోచించే విధానంలోనే ఓ పరిష్కారం ప్రతిబింబించాలి. నువ్వు చెప్పినదాన్ని బట్టి చూస్తే నువ్వు లోకం కూసే కూతలకి భయపడి నీ కూతుర్ని మనవడ్ని ఎప్పటికైనా పంపేద్దామనుకున్నావు. వాళ్లని నీకో భారంగా తలచావు. కానీ నిజంగా ఆలోచిస్తే ఆ కూపంలోకి ప్రవేశిస్తే నీకూతురు ఏమాత్రం సుఖపడుతుంది? నిజానికి కారణాలేమైనా మనిద్దరి పరిస్థితీ ఒక్కటే. కానీ పరిష్కరించుకునే విధానంలోనే తేడా'' అన్నాడు సోమనాథం.

సోమనాథం తెరిపిన పచ్చ వాతావరణంలా ప్రతిబింబించాడు. తనేమో తుపానుతో కూడిన అస్తవ్యస్త పరిస్థితిలా కనిపిస్తున్నాడు.

తను వ్యవహరించే తీరు ఎంత మాత్రం సమర్ధనీయంకాదు. కడుపున పుట్టిన బిడ్డలు ఏనాటికీ బరువు కాదన్న సూక్తిని తను ఒంటబట్టించుకోలేదన్న మాట. అదే తను జీర్ణించుకుని ఉంటే మరల నరకంలాంటి ఆ ఇంట్లోకి కూతుర్ని పంపడానికి ఎట్టి పరిస్థితుల్లో ఆలోచించేవాడు కాదు.

భార్యకు భర్త ఎంత అవసరమో, భర్తకు భార్య కూడా అంతే అవసరం. ఆ రీతిలోనే సోమనాథం వ్యవహరించాడు. అందుకు భిన్నంగా తను ఆలోచించాడు. కాబట్టే తనింతగా అతలాకుతలమైనాడు. సోమనాథాన్ని కలిశాక శ్రీనాథ్‌లో ఎనలేని ధైర్యం కలిగింది. ఆ దిశగా అతని ఆలోచనలు కదిలాయి. ఇప్పుడు శ్రీనాథ్‌కి త్వరగా ఇల్లు చేరి కూతుర్ని, మనవడిని చూడాలనిపిస్తోంది. అందుకే సోమనాథం ఉండమంటున్నా వీలుకాదంటూ అక్కడ్నించి కదిలాడు.

★

## పొంచి ఉన్న ప్రమాదం

2004 నాటికి సునామీ హిందూ మహా సముద్రం తీర ప్రాంతాల జనాభాలో 2.3లక్షమంది చనిపోయారు. ఇటీవల అమెరికన్ భూగర్భ శాస్త్రజ్ఞులు చేసిన ఓ సర్వేలో ప్రపంచంలోని నాల్గవవంతు జనాభా సముద్రమట్టానికి 100 అడుగుల క్రింద నివశిస్తున్నారని తేలింది. మళ్లీ సునామీలు వచ్చి సముద్రమట్టం కనుక 100 అడుగులు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా 37లక్షల చదరపు మైళ్ళ నేల మునిగిపోతుందిట. కేవలం 16 అడుగుల ఎత్తు నీరు పెరిగితే 67 కోట్ల మంది బాధితులు అవుతారని, అదే వందడుగుల ఎత్తు నీరు వస్తే ఎంత ప్రమాదమో ఊహించలేమని నిపుణులు అంటున్నారు.

## మొదటి ఫ్యాషన్‌షో

1800లలో పారిస్‌లో సాంస్కృతిక సమారోహాల్లో అప్పుడప్పుడూ ఫ్యాషన్ పేరేడ్లు జరిగేవి. ఈ సంస్కృతిని అమెరికా వాళ్ళు దిగుమతి చేసుకున్నాక న్యూయార్క్ సిటీలో ఎర్లిచ్ బ్రదర్స్ స్టోర్ వాళ్ళు 1903లో మొదటి ఫ్యాషన్ షోని ఏర్పాటుచేశారు.

## ఆత్మరక్షణ కోసం పోరాటం

మాస్కో జూలో ఓ దుండగుడు దూరి గుడ్లగూబనొకదానిని దొంగిలించబోయాడట. అది అతనికి దొరక్క ప్రతిఘటించింది. పట్టుజారి చెట్టుమీద నుంచి క్రిందపడిన అతను తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలై చనిపోయాడు. చెట్టుకింద పడిన గుడ్లగూబ ఈకల్ని చూసాక అది తన ఆత్మరక్షణ కోసం ఎంత పోరాడిందో జూ నిర్వాహకులకు అర్థమైందిట!

## పొగ తాగే వైద్య విద్యార్థులు

జ్వరం, దగ్గుతో తరచూ బాధపడే రోగులతో పొగ తాగడం మానమని వైద్యులు చెబుతారు. కానీ ఢిల్లీ మెడికల్ కాలేజీ విద్యార్థులు చాలామంది పొగకు బానిసలవుతున్నారని ఇటీవల ఓ సర్వేలో తేలింది. వీళ్ల దురలవాటును మాన్పించలేకపోతున్నామనీ, భవిష్యత్తులో వీళ్ల పేషెంట్ల గతి ఏమిటని ప్రొఫెసర్లు తలలు పట్టుకుంటున్నారు.

-తటవర్తి